విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 22, నవంబర్ 2022

దూరవిద్య పరీక్షా కేంద్రాన్ని ప్రకటిస్తే ఉద్యమమే

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కి అనుబంధంగా ఉన్న దూరవిద్య కేంద్రం అయిన శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాలలో ప్రకటిస్తే ఉదయ్యమం తప్పదని వామపక్ష విద్యార్థి సం ఘాల నాయకులు అన్నారు. సోమవారం దాని వ్యతిరేకిస్తూ స్థానిక తహసిల్దార్ రాజశేఖర్ బాబుకు వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాసులు ఆది నాగరాజు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని అధికారులు ప్రకటిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సంబంధిత ఎస్వియు అధికారులను హెచ్చరించారు. ఎస్వి యూనివర్సిటీ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా ఆ కళాశాలలో కోఆర్డినేటర్ వసూలు చేయడం తగదన్నారు. బుక్స్ ఫీజులు అంటూ పబ్లిక్ పరీక్షలు జరిగే టైంలో యూనివర్సిటీ నుంచి వచ్చే అబ్జర్వర్లకు డబ్బులు ఇవ్వాలి లేకుంటే పరీక్షలు స్ట్రిట్‌గా జరుగుతాయని విద్యార్థులను బెదిరించిమరి ఒక్కొక్క విద్యార్థి నుంచి 2000 నుంచి 3000 వరకు వసూలు చేస్తున్నారన్నారు. వేంకటేశ్వర డిస్టెన్స్ ఎడ్యు కేషన్ వ్యాపారమయంగా తయారు చేశారనీ ఈకళాశాలలో పనిచేస్తున్న కోఆర్డినేటర్ గతంలో ఆచార్య నాగార్జున యూనివ ర్సిటీకి అనుబంధంగా బివిఆర్ డిగ్రీ కళాశాల గడి వేములలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నడిపేవా దని అక్కడకూడాఅధిక ఫీజులు వసులుచేస్తు విద్యార్థులకు అన్యాయం చేయడం జరిగింద న్నారు. విద్యార్థి సంఘాల పోటరంతోనే ఆ కళాశాల ను బ్లాక్ లిస్టులో యూని వర్సిటీ అధికారులు పెట్టడం జరిగిందన్నారు. సెంటర్లను తనిఖీ చేసి విద్యార్థులకు జరుగుతున్న అన్యాయా లపైచర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది రంగస్వామి పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించండి

విశాలాంధ్ర - నంద్యాల : స్పందన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండా గడువులోగా అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ పెండింగులో వున్న స్పందన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండా గడువులోగా దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 92 రీఓపెన్ దరఖాస్తులు, వితిన్ ఎస్ఎల్ఏ లో 1057 దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న 6 దరఖాస్తులు, 24 గంటల్లో పరిష్కరించాల్సిన 10 సమస్యలు, నలబై ఎనిమిది గంటల్లో వున్న 7దరఖాస్తులు, పెండింగులో వున్న 188 ఎ.పి.సేవా సర్వీసులను త్వరితగతిన క్లియర్ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అన్ని శాఖల్లో కోర్టుకు సంబంధించిన కంటెంప్ట్ కేసులకు కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను వెంటనే అమలు పరచాలని సంబంధిత ఆర్డీవోలు, తాసిల్దార్లను, అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వార్తాపత్రికల్లో ప్రతిరోజు వచ్చే వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి ఏ రోజుకారోజు యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లతో పాటు రీజాన్డర్లు పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అభివృద్ధి పేరుతో పేదలపై దౌర్జన్యం చేస్తే వ్యతిరేకిస్తాం

విశాలాంధ్ర-డోన్ : నియోజకవర్గ అభివృద్ధికి సీపీఐగా అభినందిస్తామని,అభివృద్ధి పేరుతో పేదలపై దౌర్జన్యం చేస్తే వ్యతిరేకిస్తామని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి ఎస్ పులి శేఖర్, పట్టణ కార్యదర్శి బి.నారాయణలు మాట్లాడుతూ రుద్రాక్ష గుట్టలో నిర్మించుకున్న

ఇళ్ళకు పట్టాలు ఇవ్వాలని కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. అయితే కాంగ్రెస్, టీడీపీ,వైసీపీ ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వకుండా మోసం చేశాయని మండిపడ్డారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు గెస్ట్ హౌస్ దగ్గర నుంచి ర్యాలీ, డోన్ పాత బస్టాండ్ లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఏఐవైఎఫ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కామ్రేడ్. నక్కి లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు పాల్గొంటారని తెలిపారు. కావున కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులు కార్మికులు సానుభూతిపరులు రుద్రాక్ష గుట్ట లబ్ధిదారులు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్యాపలి మండల కార్యదర్శి పి వెంకటేష్, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు, జిల్లా సమితి సభ్యులు కే ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి అబ్బాస్, శేఖరు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానంలో నెలకొన్న పిచ్చిమొక్కలను ట్రాక్టర్ రోటవేటర్ సహాయంతో సోమవారం తొలగించారు. పాఠశాలలో 2014-15, 2015-16 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన ఓబులేస్, ప్రహల్లాద, సతీష్ కుమార్ లు తన సొంత నిధులతో విద్యార్థులకు క్రీడలకు అవసరమైన స్థలాన్ని మెరుగుపరిచారు. పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-వెలుగోడు : రాష్ట్రస్థాయి లో మత్స్యకా రుల అభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. మత్స్య శాఖ దినోత్సవం వెలుగోడు లోని ఎన్టీఆర్ రిజర్వాయర్ లో సోమవారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తొమ్మిది లక్షల50 వేల చేప

పిల్లలను వదలడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పాటుబడతానని, ఇటీవల మరణించిన మత్స్యకార యువకుడు ఎల్లయ్య కుటుంబం నకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని అన్నారు. మత్స్యకార అభివృద్ధి అధికారి భరత్, తెలుగు గంగ ఏ.ఇ శ్రీను నాయక్,ఎంపిపి లాలం రమేష్, సర్పంచ్ జైపాల్,మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర రెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, రైతు సంఘము అధ్యక్షుడు తెలుగు రమణ, వైఎస్ ఆర్ సిపి నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టిడిపి నాయకుడు మృతి

విశాలాంధ్ర-ప్యాపిలి : ప్యాపిలి టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి సూరి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. డోన్ నియోజకవర్గం ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి సూరి భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి వారికి మేము అండ ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. సూరి టిడిపి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు అని ఆయన మంచి నాయకుడని పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, గొల్ల రామ్మోహన,సుంకయ, చల్లా.వీర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - అవుకు : అవుకు మండలంలోని గుండ్ల సింగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాధికారి శ్రీధర్ రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము పాత మెనూ తీసివేసి కొత్త మెనూ ప్రకారము నాణ్యమైన జగనన్న గోరుముద్ద ను విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. కొత్త మెనూలో సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కిలను విద్యార్థులకు అందించడం జరిగినది తెలిపారు. మధ్యాహ్నం భోజన వంట నిర్వాహకులు ప్రతి పాఠశాలలో కూడా ప్రభుత్వం తెలిపిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు జగనన్న గోరుముద్దను అందించాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుని అభినందించిన బిసి

విశాలాంధ్ర-బనగానపల్లి : పట్టణంలోని టిడిపి కార్యాలయం నందు సంజామల మండలం ఆకుమల్ల గ్రామానికి చెందిన మహబూబ్ పీరా కుమారుడు అబ్దుల్ రసూల్ తిరుపతి (రేణిగుంట) లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ)పోటీలలో పాల్గొని జాతీయ స్థాయి లో అయోధ్య లో జరిగే పోటీలకు ఎంపికైన సందర్భంగా బనగానపల్లె మాజీ శాసన సభ్యులు బీసీ జనార్ధన్ రెడ్డి వారి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి కలవడం జరిగింది. బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందు వరసలో ఉంటాన్ననరు. కాత్రేడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

విశాలాంధ్ర-కొత్తపల్లి : నల్లమల్ల ప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో

రాష్ట్ర శాప్ చైర్మన్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్తీక మాసం చివరి సోమవారం రోజున కొత్తపల్లి మండలం లో ఉన్న శివపురం గ్రామ శివారులో వెలసిన కొలను భారతి క్షేత్రాన్ని దర్శించుకున్నారు.ఆలయ పురోహితులు ఆలయ మర్యాదలతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీపీ కుసుమలత వైస్ ఎంపీపీ సింగారం రంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి మండల నాయకులు జనార్ధన్ రెడ్డి నారాయణరెడ్డి సర్పంచులు నిత్య లక్ష్మీదేవి బాల ఎల్లయ్య ఎంపీటీసీలు శివన్న అల్లి భాష బాలరాజ్ కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్ మండల వైసీపీ నాయకులు మహబూబ్ బాషా ముని లోకేశ్వర్ రెడ్డి బాబు రెడ్డి రామకృష్ణుడు మా భాషలు పాల్గొన్నారు.

శివనామస్మరంతో మారుమ్రోగిన నేలబిలం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : నంద్యాల, అనంతపురం, కడప మూడు జిల్లాల సరిహద్దులోని శ్రీ నేలబిలం మల్లేశ్వర స్వామి క్షేత్రం శివనామస్మరంతో మారుమోగింది. స్వామివారు అందరిని చల్లగా చూడాలని మొక్కుకున్నారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకొని స్వామివారి తిరుణాల బ్రహ్మోత్సవానికి అశేష భక్తులు తరలివచ్చారు. మండలంలో బంధార్లపల్లి గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ నేలబిలం మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.తెల్లవారుజామునుంటే క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయం కి ఎదురుగా నేలబిలంలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయం ఎదుట మహిళలు పెద్ద ఎత్తున కార్తీక పవిత్ర దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.భక్తులతో కిటికీటలాడాయి.చెక్కభజనలు భక్తి పాటలతో హోరెత్తాయి. తిరుణాల సందర్భంగా తాడపత్రి ఆర్టీసీ డిపో వారు స్వామి వారి క్షేత్రానికి ప్రత్యేక బస్సులను నడిపారు. వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం నుండి రాత్రి వరకు అన్నదానం గావించారు.ఎస్ఐ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలోపోలీసులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

సంతకాలు సరే....అధికారులు ఎక్కడ..?

విశాలాంధ్ర-అవుకు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అయితే అవుకు మండల అధికారులు మాత్రం ఈ స్పందన కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆశయానికి, ప్రజల సమస్యల పరిష్కారాలకు తూట్లు పొడుస్తున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అన్ని శాఖలకు సంబంధించిన మండల అధికారులు పాల్గొనాలి. కానీ స్పందన కార్యక్రమానికి సంబంధించిన రిజిస్టర్లో 12 మంది అధికారులు సంతకాలు చేయగా మధ్యాహ్నం 12 గంటల సమయానికి విలేకరులు స్పందన కార్యక్రమానికి వెళ్లి చూడగా తహసిల్దార్ శ్రీనివాసులు, మండల అభివృద్ధి అధికారి అజాం ఖాన్, ఐసిడిఎస్ సిడిపిఓ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ అధికారి ప్రసాద

రావు మాత్రమే ఉన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సమస్యలను స్పందన లో అర్జీలు రూపంలో ఇచ్చేందుకు రాగా ఇవేవీ మాకు సంబంధం లేదు అన్నట్లుగా 8 మంది అధికారులు సమా వేశంలో లేక పోవడంతో అర్జీదారులు అవాక్కయ్యారు. మండల స్థాయి అధి కారులే ఇలా వ్యవహరిస్తుంటే కింది స్థాయి ఉద్యోగుల పరిస్థితి ఏమిటి అని ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి స్పందనకి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేల చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

తూడిచెర్ల గ్రామానికి రహదారిని నిర్మించాలి

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా : మండలంలోని పారుమంచాల నుండి తూడిచేరుల గ్రామానికి ఉన్న రహదారి అస్తవ్యస్తంగా ఉండి,పూర్తిగా దెబ్బ తినడంతో ,ఈ రోడ్డు గ్రామ పంచాయతీలో ఉన్నందున, ఈ రోడ్డును ఆర్ అండ్ బి లో కలపాలని ఏపీ రైతు సంఘం నందికొట్కూరు తాలూకా కన్వీనర్ అహ్మద్ తెలిపారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తూడిచెర్ల గ్రామానికి వచ్చిన నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ఆర్థర్ కివినతి పత్రం అందజేశారు. అహ్మద్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి నేటి వరకు ఈ రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నదని, ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు నరకయాన పడుతున్నారని వారన్నారు. గర్భిణీ స్త్రీలు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారని వారన్నారు. అదేవిధంగా విద్యార్థులకు బస్సు సరైన సమయానికి రాక అనే ఇబ్బందులకు గురవుతున్నారు. కావున ఎమ్మెల్యే ఆర్థర్ దయవుంచి ఈ రహదారిని శాంక్షన్ చేయించి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని వారన్నారు. అదేవిధంగా కేసీకెనాల్ పక్కన ఉన్న పంట కాలువ దెబ్బ దెబ్బ తినడంతో, నీరు గ్రామంలోకి రావడంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ పంట కాలువలను వెంటనే పూర్తి చేయించాలని వారన్నారు.లక్ష్మన్న,చంద్రుడు,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఐకమత్యంతో ఉండాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : సచివాలయ ఉద్యోగులమంతా ఐకమత్యంతో ఉండాలని సచివాలయ యూనియన్ సంఘం అధ్యక్షులు బాలస్వామి అన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ సచివాలయ ఉద్యోగుల సంఘం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం యూనియన్ ను ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులుగా బాలస్వామి ఉపాధ్యక్షులుగా సురేష్ కుమార్, శ్రీలేఖ అలాగే కార్యదర్శిగా ఆంజనేయులు సమన్వయకర్తలుగా చెన్నకేశవరెడ్డి, మౌలాలిలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ని కలిసి తమ యూనియన్ కు సంబంధించిన వివరాలను తెలుపుతూ సమాచార పత్రాన్ని అందజేశారు. సచివాలయ ఉద్యోగుల ఐకమత్యం కొరకే యూనియన్ స్థాపించడం జరిగిందని బాలస్వామి తెలిపారు.

ఘనంగా కార్తిక వనభోజన మహోత్సవం

విశాలాంధ్ర-నంద్యాల: స్థానిక నంద్యాల పట్టణంలోని జంబుల పరమేశ్వరి దేవస్థానం నందు మరాఠాసేవా సంఘం అధ్యక్షులు నాగరాజారావు, ఇన్చార్జి సెక్రెటరీ చవాన్ పుల్లోజీరావువారి

ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన ఈ కార్తిక మాస వనభోజన కార్యక్రమానికి పెద్ద ఎత్తున మరాఠా బంధువులు సంఘ కార్యకర్తలు, మిత్రులు శ్రేయోభిలాషులు ఈ కార్తిక మాస వనభోజన మహోత్సవానికి హాజరు కావడం జరిగినది. నంద్యాల మరాఠా సంఘం ఇన్చార్జి సెక్రటరీ చవాన్ పుల్లోజీరావు,గౌరవ అధ్యక్షులు పి.చంద్రమౌళీశ్వరరావు, శ్యామ సుందర్రావు, జె. రవిరాకేష్ జీ, చవాన్ నర్సోజిరావు, హనుమంతరావు, అఖిలభారత మరాఠా ప్రెసిడెంట్ ఎన్.కే.బి. సాగర్, అఖిలభారత మరాఠీ సెక్రెటరీ, ఇంద్రకర్ సుధాకర్, మహిళ మరాఠా సంఘ విభాగం ప్రెసిడెంట్ జాదవ్ రమాబాయి, మరాఠా సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హైకోర్టును అడ్డుకుంటే టీడీపీకి అభ్యర్థుల కరువు

విశాలాంధ్ర-చాగలమర్రి : రాయలసీమ ప్రజల మనోభావాలను దెబ్బతినేలా హైకోర్టును అడ్డుకుంటున్న టీడీపీకి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ కర్నూలు జిల్లాలో ఆ పార్టీకి అభ్యర్థులు కరువైతారని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం చాగలమర్రిలో వైసిపి నాయకుడు ముల్లా ఖాజా రసూల్ కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూల్ పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనోభావాలు దెబ్బ తినేలా మాట్లాడడం ఆయన రాజకీయ అనుభవానికి సరైనది కాదన్నారు. ఆయన మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడో లేక ఉద్దేశపూర్వకంగా మాట్లాడుతున్నారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా, 13 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు పరిపాలన సౌలభ్యం కొరకు మూడు రాజధానుల వికేంద్రీకరణను వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదని హితువు పలికారు. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కోఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజుద్దీన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు టూ వీలర్స్, ఐస్ బాక్స్‌ల పంపిణీ

విశాలాంధ్ర - నంద్యాల : అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో 21 మంది మత్స్యకారులకు టూ వీలర్స్, ఐస్ బాక్స్ లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా ద్వారా ఓఎన్జిసి కార్యకలపాలతో వేట కోల్పోయిన 23 వేల మంది మత్స్యకారులకు రెండో విడత ఆర్థిక సాయంగా రూ.108 కోట్ల రూపాయలను బటన్ నొక్కి నగదు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాఖ్ బాషా, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మత్స్య సంఘ ప్రెసిడెంట్ వెంకటస్వామి, మత్స్య శాఖ జెడి రాఘవరెడ్డి వీక్షించే కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి లైవ్ అనంతరం జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్, యంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాఖ్ బాషాలు 21 మంది మత్స్యకారులకు టూ వీలర్స్,ఐస్ బాక్స్ ల మంజూరు ఉత్తర్వులను పంపిణీ చేశారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-జూపాడు బంగ్లా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమంమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగుర్ ఆర్థర్ పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ భాగంగా సోమవారం మండలంలోని తుడిచెర్ల గ్రామంలో పర్యటించారు. గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ మాట్లాడుతూ ప్రజల బాగోగులు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గడప గడపకు కార్యక్రమానికి చుట్టారని వారన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని వారన్నారు.అనంతరం అంగన్వాడి కేంద్రం తనిఖీ చేసి చిన్నారులచే ఆంగ్ల అక్షరాలు అంకెలు తెప్పించారు. సర్పంచ్ బాల మద్దిలేటి, తాసిల్దాల్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీవో మంజుల వాణి, ఈ ఓ ఆర్ డి మనీ మంజరి, వెలుగు ఏపిఎం అంబమ్మ, గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్, వైఎస్ఆర్సిపి మండల నాయకులు దేవ సహాయం, జంగాల పెద్దన్న, కిరణ్ కుమార్ రెడ్డి ,నీలకండీశ్వర్ రెడ్డి, పద్మనాభయ్య, పాల్గొన్నారు

కాశింతలలో పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కార్తీకమాసం కడ సోమవారం సందర్భంగా శివ పంచాక్షరితో శివాలయాలు మారుమ్రోగాయి. పట్టణ శివారులో ఉన్న కాశింతల కాశీ విశ్వేశ్వర స్వామి

ఆలయా నికి వేలాది సం ఖ్యలో భక్తులు తరలి వచ్చి వకులా నదిలో పుణ్యస్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు.. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే వకుళానదిలో నుండి అవతలి వైపుకు అన్నదానానికి వెళ్లేందుకు భక్తులకు వీలుగా నీళ్లలో బారికేడ్లను నిర్మించారు.

కాశీ విశ్వేశ్వ రుని దర్శించుకున్న మండలి విప్ గంగుల.... : పట్టణ శివార్లలో ఉన్న కాసింతలలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్దకు ఆయన చేరుకోగానే అర్చకులు, నిర్వాహకులుఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.కాశి విశ్వేశ్వర స్వామినీ దర్శించుకుని ప్రత్యే క పూజలు చేశారు.చింతకుంట ఇంజేటి రంగేశ్వర్ రెడ్డి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మండలి విప్‌గంగుల ప్రభాకర్‌రెడ్డిపాల్గొని అన్నం వడ్డించారు.

లక్ష మంది భక్తులకు అన్నదానం...

కార్తీక కడ సోమవారం సందర్భంగా పట్టణ శివార్లలో ఉన్న కాచింతల కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన దాదాపు లక్ష మంది భక్తులకు చింతకుంట రంగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రంగేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాశింతలకు స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు గత 30 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. అలరించిన రేలారే రేలా కాసింతల కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల వినోదం కోసం నిర్వాహకులు రేలారే రేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జబర్దస్త్ జీవన్ తో కూడిన బృందం రేలారే రేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. భారీ బందోబస్తు: డిఎస్పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాశింతల క్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాసింతలకు ఇరువైపులా ఆళ్లగడ్డ పట్టణం నుండి వచ్చే దిశగా, పడకండ్ల వైపు నుండి వచ్చే దిశగా ట్రాఫిక్ ను కంట్రోల్ చేసేందుకు పోలీసులను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయం వద్ద,అన్నదానం వద్ద భక్తుల రద్దీలో పోలీసులు మమేకమై శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు.

వాతావరణ మార్పుపై రైతులు జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర-నందికొట్కూరు : వాతావరణ మార్పులపై రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిని శ్రావణి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో రైతుల్లో గుబులు నెలకొందన్నారు. మండలంలో పంటలు కోత దశకు రావడంతో అనేకచోట్ల రైతులు ఆందోళన చెందకుండా తగిన సూచనలు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. భారీ వర్షాలు కొనసాగితే పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, ముసురు వాతావరణం వల్ల తెగుళ్ల వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా నివారణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

వీరారెడ్డి పల్లె ప్లాస్టిక్ బియ్యం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని వీరారెడ్డి పల్లి గ్రామంలో ప్లాస్టిక్ రైస్ కార్డుదారుల్లో ఆందోళన కలిగించాయి,ఈనెల 19 నుంచి రేషన్ షాపుల్లో వేసిన ఉచిత బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం రావడం జరిగిందని కొందరు బియ్యాన్ని పక్కనపెడుతుండగా మరికొందరు ప్లాస్టిక్ రైస్ ను కల్తీ కలిసిన బియ్యాన్ని వండుకొని తిన్న వారు ఎటువంటి అనారోగ్య పరిస్థితులు దాపురుస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ప్లాస్టిక్ బియ్యం రావడానికి గల కారకులను గుర్తించి అలాంటి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకావాలని కోరారు, డీలర్ పై విచారణ జరపాలని ఈ గ్రామములో ఉన్న ఒక్క డీలర్ వద్ద మాత్రమె ప్లాస్టిక్ రైస్ వచ్చాయా, లేఖ ఇతర చౌక దుకాణం లో కూడా ప్లాస్టిక్ రైస్ కల్తీ చేశారా, అన్నా ఆహార కల్తీ వ్యవహారం పై సివిల్ సప్లై మరియు ఇతర అధికారులు విచారణ జరపాలని వీరారెడ్డి పల్లె గ్రామ వైసిపి నాయకులు తలారి పెద్ద బాలయ్య, ఇతర మహిళలు కోరారు.

స్పందనలో వచ్చే సమస్యల పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - డోన్ రూరల్: స్పందనలో వచ్చే సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధతో స్పందిస్తామని తహశీల్దార్ విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్పందనలో పలువురు తమ సమస్యల అర్జీలను తహశీల్దార్‌కు సమర్పించారు. బాధితుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంతవరకు సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈవో ఆర్ డి వరప్రసాద్, వీఆర్వోలు మల్లారెడ్డి, రాజు, గోవిందు పలు శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

నంద్యాలలో ధన్వంతరి జయంతి

విశాలాంధ్ర - నంద్యాల : ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల ఆయుష్ విభాగము, ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఫరూక్ నగర్, ఆత్మకూరు బస్టాండ్, గాంధీ చౌక్ శ్రీనివాస్ సెంటర్ మీదుగా శ్రీ శారద విద్యాపీఠం విద్యార్థిని విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల యందు నిర్వహించిన సమావేశంలో ఆయుర్వేదం ఆధునిక జీవనశైలి వల్లనే వచ్చే వ్యాధులను నివారించుటలో ప్రతిభావంతంగా పనిచేస్తుందని, పోపులపెట్టెలోని దినుసులన్నీ ఆరోగ్యాన్ని పరిరక్షించేవని దినచర్య, ఋతుచర్య, రాత్రి చర్య, పాటించడం వల్ల వ్యాధి రహితంగా ఉంటూ దీర్ఘాయువును పొందవచ్చునని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు వివరించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నంద్యాల డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, ప్రధాన వక్తగా అఖిలభారత ఆరోగ్య భారతి ముఖ్యులు డాక్టర్. ఆర్ మురళీకృష్ణ , ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ జి. యశోధర, డాక్టర్ శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ నాయుడు, ఆయుష్ విభాగ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు హాజరు కావడం జరిగినది.ఈ సమావేశం నందు డా.గెలివి సహదేవుడు, శ్రీదేవి, వ్యాపారవేత్త జెవిసి ప్రసాద్, ప్రముఖ రైతు సుబ్రహ్మణ్యం, ఆయుష్ శాఖలో పనిచేస్తున్న వీరప్రసాద్ లను సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉదయ్ శంకర్, ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి, డాక్టర్ సి మధుసూదన్ శర్మ, డాక్టర్ రామ శర్మ, పుల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

భక్తిశ్రద్ధలతో కార్తీక కడ సోమవార పూజలు

విశాలాంధ్ర-బనగానపల్లి : కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బనగానపల్లె మండలం లోని యాగంటి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉమామహేశ్వర్ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పార్వతి పరమేశ్వరుని దర్శించుకున్నారు.బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు, ఎస్సై రామిరెడ్డి, శంకర్ నాయక్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తయాగంటిరెడ్డి,ఆలయచైర్మన్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: కార్తీక మాసం చివరి సోమవారము మండలంలోని శివాలయాలు భక్తులతో కిటికిట లాడాయి. వేకువ జామున్నే భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల ఆవరణలో దీపాలు వెలిగించారు. జమ్మలమడుగు కోవెలకుంట్ల ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో మాయలూరు గ్రామ సమీపంలో యాగంటి, నయ నాలప్ప క్షేత్రానికి వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో సమిష్టిగా భోజనం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాయలూరు గ్రామ ఉపసర్పంచ్ షేక్షావలి రెడ్డి, వైకాపా నాయకులు రేనాటి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని వివిధ గ్రామాలలో గల శివాలయాలలో కార్తీక కడ సోమవార పూజలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.తెల్లవారుజామునుండే మహిళలు అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి అభిషేకాలు చేశారు. అలాగే మహిళలు వెలిగించిన దీపాలతో ఆలయాలు వెలిగిపోయాయి. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలో గల భైరవేశ్వర ఆలయంలో, చిన్న వంగలి గ్రామ సమీపంలోని నల్లమల అటవీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో, అలాగే చాగలమర్రి పట్టణంలోని శ్రీ చాగలమ్మ ఆలయంలో భక్తులకు పెద్ద ఎత్తున వనభోజనాలను ఏర్పాటు చేశారు. భక్తులు తండోపతండాలుగా శైవ క్షేత్రాలకు తరలి రావడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

విశాలాంధ్ర - అవుకు : మండలంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో పొట్టే తాయి. తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయాలకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగించి పూజలను నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టి పట్టు వస్త్రాలను అలంకరించి మంగళహార తులను సమర్పించారు. పట్టణంలోని కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వద్ద భక్తులకు ఆలయ భజన బృందం ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. మండలంలోని భక్తులు అధికంగా తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు శివనామస్మరణతో మారు మ్రోగాయి.

పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో యువతకు ఉపాధి లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని, కొంత మంది నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వెంటనే జిల్లాను పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలుగుయువత నాయకులు టీడీపీ కార్యాలయం నుండి కలెక్టరేట్‌వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరం అయినా నేటి వరకు నోటిఫికేషన్‌లేదన్నారు. కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్‌లలో నిధులు లేకుండా కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారన్నారు.ప్రతి ఏటీ 6500 పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయల న్నారు. 25మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానని చెప్పిన సీఎం ప్రస్తుతం రాజ్యసభతో కలసి 36మంది ఎంపీలు ఉన్నా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. తెలుగుయువత నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు అబ్బాస్, కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్,ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్‌నాయుడు, వంశీదర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మెన్ మల్లెల రాజశేఖర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మెన్ పెరుగు పురుషోత్తమరెడ్డి, గున్నామార్క్, సంజీవలక్ష్మీ, చంద్రకళాబాయి తెలుగుయువత నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీటిమట్టం పెంచాలి

విశాలాంధ్ర - పత్తికొండ : కొత్తపల్లి, పందికోన రిజర్వాయర్ నీటిమట్టం పెంచాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో దూదేకొండ రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువకు డిసెంబర్ చివరి వరకు మాత్రమే నీటి సరఫరా ఉంటుందని ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన పంటలు అక్టోబర్ నెలలో కురిసిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయితే హంద్రీనీవా కాలువలో నీరు పుష్కలంగా ప్రవహిస్తుందన్న ఆశతో రబీలో కుడి, ఎడమ కాలువల క్రింద వివిధ రకాల పంటలను సాగు చేశారన్నారు. ఇరిగేషన్ అధికారులు డిసెంబర్ చివరి వరకు మాత్రమే నీటి సరఫరా ఉందని తేల్చి చెప్పడంతో రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా కొత్తపల్లి, పందికోన రిజర్వాయర్ లోకి పూర్తిస్థాయి నీటిమట్టం పెంచి, రైతులు సాగు చేసిన పంట పొలాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ విష్ణు ప్రసాద్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు తిరుమలేష్, సంజప్ప, అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ, పాత్ కేర్, ఈషా డయాగ్నస్టిక్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : నగరంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మాధవి నగర్ లోని విజయ డయాగ్నస్టిక్, బిర్లా గేట్ లోని పాత కేర్, గాయత్రి స్టేట్ లోని ఈషా డయాగ్నొస్టిక్ సెంటర్ లపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావుకి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు,నగర కార్యదర్శి బిసన్న ,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్నలు మాట్లాడుతూ పేరుకేమో కార్పొరేట్ డయాగ్నస్టిక్ సెంటర్స్ అని చెప్పుకుంటూ ప్రభుత్వం నుండి అనుమతులు లేకుండానే డయాగ్నస్టిక్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు వాటిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు.కార్పొరేట్ వారిచ్చే మాముళ్ళకి అలవాటు పడ్డారన్న ఆరోపణలు కూడా ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్ యాజమాన్యాలు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోకుండానే ఇష్టానుసారంగా గల్లికొకటి ఏర్పాటు చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. అధికారులు ఇలాంటివి వాటి గుర్తింపు రద్దు చేయడమే కాకుండా యాజమాన్య పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఈ మూడే కాకుండా జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో సైతం కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే చిన్న చిన్న రూముల్లో ఆర్ఎంపీ డాక్టర్లతో కలిసి డయాగ్నొస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని చిన్నపాటి జ్వరానికి డాక్టర్ దగ్గరికి వస్తే అవసరం లేకున్నా వారికి పరీక్షలు చేస్తూ పేద ప్రజల నుండి వేలకు వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటి పైన కూడా సమగ్ర విచారణ జరిపించి అనుమతులు లేకుండా అర్హత లేని వ్యక్తులు నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్ సీజ్ చేసి ప్రజల ప్రాణాలను, డబ్బులను ,కాపాడాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ గా ప్రత్యక్ష ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహి స్తున్న స్కావెంజర్ల కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి

కృష్ణయ్య, స్కావెం జర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు సుంకమ్మ లు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్డిఓ మోహన్ దాస్ కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్కావెంజర్లకు గుర్తింపు కార్డు లు ఇచ్చి, స్కావెంజర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్.రా మాంజనేయులు, స్కావెంజర్స్ యూనియన్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధమ్మ, లక్ష్మమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, స్కావెంజర్లు అనసూయమ్మ, లక్ష్మమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : నవరత్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 4,9,10 వార్డులలో వడ్లపేట, ఏబీఎం పాలెం, ఎస్పీజి పాలెం, తెరు వీధి,

కల్లా వీధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే శిల్పాకు పూలమాలతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం నవరత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే రాష్ట్రాన్ని ముంద డుగులో ఉంచారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ప్రతి గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా ముందుకు వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు సుల్తాన్, విజయ్ చౌదరి, కలిముల్లా, సుందరావు, సుల్తాన్, రంగస్వామి, ప్రకాష్, యూనిస్, వైసీపీ పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ, కమిషనర్ శ్రీనివాసరావు,సచివాలయసిబ్బంది, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ న్యాయవాది మృతి

విశాలాంధ్ర-కర్నూలు లీగల్ : కర్నూల్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఈరన్న అనారోగ్యంతో మృతి చెందారు. కర్నూల్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. రంగడు, సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన ఈరన్న కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన తహసిల్దారుగా పనిచేశారని, రిటైర్డ్ అయిన తర్వాత న్యాయవాది వృత్తిలో జీవన కొనసాగించేవారన్నారు ఆయనకు సీనియర్లు, జూనియర్లు న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉరుకుంద ఈరన్న స్వామికి వెండి విరాళం

విశాలాంధ్ర- కౌతాళం రూరల్ : కొలిచేవారికి కొంగుబంగారంగా లక్షలాది మంది భక్తులచే పూజలు అందుకుంటున్న శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామికి బళ్లారి పట్టణానికి చెందిన భక్తుడు వెండి హారతి పళ్ళాన్ని

విరాళంగా అందజేసినట్లు ఆలయ సూపర్డెంట్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఉదయం కర్ణాటకలోని బళ్లారి పట్టణానికి చెందిన విశ్వనాథ్ రాజ్ అనే భక్తుడు వెండితో చేయించిన1.30 కేజీల వెండి పళ్లెం ను స్వామివారికి విరాళంగా ఇవ్వగా,వైజి హేమంత్ రాజ్ కుటుంబ సమేతం గా పుణ్యక్షేత్రానికి తరలివచ్చి ఆలయ అభివృద్ధి కోసం తమవంతుగా1,00,116 లక్షల రూపాయలను నగదును జమ చేసినట్లు ఆలయ అధికారులు వివరించారు. అధికారులు దాతలను ప్రత్యేక దర్శనం, పూజలు చేయించి స్వామి వారి శేష వస్త్రాలను, స్వామివారి ప్రసాదాలను, దాతలకు అందజేసినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-హొళగుంద : మండల తహశీల్దార్‌గా డి హుస్సేన్ సాబ్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు .మండల ఇన్చార్జ్ తహశీల్దార్ గా పనిచేస్తున్న దీప నుండి రెగ్యులర్ తహశీల్దారుగా బదిలీపై వచ్చిన డి హుస్సేన్ సాబ్ చార్జ్ తీసుకున్నారు. రెగ్యులర్ తహశీల్దార్ డీ హుస్సేన్ సాబ్ మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలు అధికారులు మీడియా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు .మండలానికి ప్రజలకు మంచి చేయడానికి వచ్చానని అన్నారు ప్రజలకు సత్వరం న్యాయం కల్పించడానికి కృషి చేస్తానని మంచి పనులు చేసి ప్రజామన్నలు పొందుతానని అన్నారు రెవిన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని గోనెగండ్ల, హాళహర్వి,ఆలూరు మండలాల్లో తహశీల్దారుగా పనిచేశానని అయితే హొళగుంద మండలం పెద్దదని స్పష్టం చేశారు.నూతన తహశీల్దార్‌కు వీఆర్‌ఏలు వైకాపా నాయకులు ఈసా శేషప్ప,షేఫీవుల్లారెవెన్యూసిబ్బందిపూలమాలలువేసి ఘనంగా సన్మానించారు.

భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మగుండ క్షేత్రం

విశాలాంధ్ర-వెల్దుర్తి రూరల్ : వెల్దుర్తి సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మగుండేశ్వరుడు ప్రసిద్ధిగాంచిన క్షేత్రంలోని బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో కార్తీక చివరి సోమవారం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. స్వామి వారికి అభిషేకం అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక స్నానాలు చేసి ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. క్షేత్రంలో బ్రహ్మగుండేశ్వర స్వామి వారిని భక్తులు ఎటువంటి కోరికలు కోరిన నెరవేర్తాయని భక్తుల నమ్మకం.పలువురు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్ద రెడ్డి,ఈవో హనుమంతరావు పాల్గొన్నారు.

పేదల పేరిట 10% రిజర్వేషన్ ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు : అగ్రవర్ణాలలో పేదల పేరిట 10% రిజర్వేషన్ ఇవ్వాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీరుపై బడుగు, బలహీన వర్గాలవారిపై ఆవేదనను, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగారికి, ప్రధానమంత్రివర్యులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు తమరి ద్వారా విజ్ఞాన పత్రాన్ని పంపించాలన్న విన్నవం అంద జేసిన వారిలో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు శివరాం, ప్రధాన కార్యదర్శి నాగార్జున గౌడ్ శివ, శిద్దరామగౌడ్, శిద్దప్ప, శివ, బీమ గణేష్, వెంకటేశ్వర్లు, తిరుపాల్, దివాకర్ , బోయరమణ, తలారి రాజు, తదితరులు పాల్గొన్నారు. సామాజికంగా, రాజకీయంగా, విద్యా ఉద్యోగ పరంగా అగ్రభాగాన్ని ఆక్రమించిన అగ్ర వర్ణాలలో పేదలు వున్న వారికి, 10%రిజర్వేషన్ ఇచ్చి రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్రప్రభుత్వం దెబ్బ తీసింది. దానిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం 3-2 మెజారీ తో తీర్పు ఇవ్వడం బడుగు, బలహీన వర్గాల వారికి అత్యంత బాధాకరమైనది. అగ్రవర్ణాలలో పేదలకు రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగంలోని ధర్మసూత్రాలకు విరుద్ధంగా వున్నది. 1992లో ఇంద్రసహాని కేసులో నాడు సుప్రీం కోర్టు 9మంది సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనం, 8-1సభ్యులమెజార్టీతో స్పష్టంగా ఇచ్చిన తీర్పును తమరి ముందుకు తీసుకువస్తున్నాం. దేశ జనాభాలో కేవలం 20% అగ్రాల వర్గా లలో కేవలం 10 కోట్ల మంది మాత్రమే అగ్రవర్ణాలలో ఆర్థికంగా

వెనుకబాటు తనంతో వున్నారని, వారికి 10% రిజర్వేషన్ ఇవ్వటాన్ని బడుగు బలహీన వర్గాల వారు తీవ్రంగా గర్హిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచి నప్పటికీ నేటికి చెట్ల క్రింద, రోడ్ల వెంబడి మురికి కుప్పలలో నివాసం వుంటూ కఠిక పేదరికం అనుభవిస్తున్న ఆ అభాగ్యులకు అంద వలసిన రిజర్వేషన్ ఫలాలు వారికి కాకుండా ఆర్థిక సామాజిక అభ్యుదయంలో వున్న వారికి రిజర్వేషన్ అప్పగించడం రాజ్యాంగా స్ఫూర్తికి విరుద్ధం.దీనిపై పూర్తి విచారణను పూర్తి స్థాయి ధర్మాసనంతో పునర్విచారణ సాగించాలని బి.సి. సంక్షేమ సంఘం తరపున సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయడం జరిగినది.

మున్సిపల్ పాఠశాలనా..కుల సంఘ కార్యాలయమా..?

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పేద పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చాలని మున్సిపల్ వ్యవస్థను తీసుకురావడం జరిగింది.ఆదోని మున్సిపల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడు రాత్రి గం,, 7బి00 సమయంలో రజకుల సంఘం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమయంలో పాఠశాల 2ప్రధాన ముఖద్వారాలకు తాళాలు వేసి గుట్టు చప్పుడు కాకుండా సమావేశాన్ని నిర్వహించడం వెనక దాగి ఉన్న రహస్యం ఏంటో విద్యార్థి సంఘాలకు,విద్యార్థులకు,తోటి ఉపాధ్యాయులకు,ప్రభుత్వానికి ఆఉపాధ్యాయుడు తెలియపరి చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మున్సిపల్ విద్యావ్యవస్థలో విధులు నిర్వహించడం అదృష్ట భాగ్యంగా భావించాలి తప్ప,నేను ఏమి చేసినా నడుస్తుంది అనుకోవడం ప్రభుత్వ నిబంధన లను తుంగలో తొక్కినట్టే. విధులకు సక్రమంగా హాజరుకాకుండా ఉపాధ్యాయ సంఘాలను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వెలివెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యుండి కుల సంఘం పేరు చెప్పుకొని చందాలకు అలవాటు పడి ఈజీ సంపాదనకు అలవాటు పడ్డాడని రజక కుల సంఘాలలోనే పలువురు విమర్శిస్తున్నట్లు ఆరోప ణలు ఉన్నాయి. విద్యార్థులకు విద్యాబోధన నేర్పే ఉపాధ్యాయుడే క్రమశిక్షణ తప్పి ప్రభుత్వ నిబంధనలను నీరుగారుస్తున్నటువంటి ఉపాధ్యాయులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయో వేచి చూడాల్సిందే.

మహా శివునికి స్వయంపాకం సమర్పణ

విశాలాంధ్ర - వెల్దుర్తి : కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా వెల్దుర్తి పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రహ్మగుండంలో వెలిసిన మహా శివునికి భక్తులు కన్నుల పండుగ వేల మంది పాల్గొని మంగళహారతులు పూజలు చేసి పండుగల చేసుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా చేపట్టారు వెల్దుర్తిలోని జర్నలిస్టు కాలనీ లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం నుండి స్వయం పాకంకు సంబంధించిన బియ్యం పాటు ప్రత్యేక పూజకు అవసరమయ్యే వాటిని అయ్యప్ప మాలదారులు పాద యాత్రగా మేళతాళాలతో తీసుకువెళ్లి శివునికి సమర్పించారు. గురుస్వామి రామకృష్ణ అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు చిరంజీవి మధు మాలాదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోని పుట్టుకలమర్రి గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అనువుగా రెండు ఆర్టీసీ బస్సులను నడపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్, మండల నాయకులు శీను, వినోద్, రాముదు లు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన లో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ లో దాదాపు 700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారిలో చాలా మంది పాఠశాలకు రావడానికి వివిధ గ్రామాల నుండి ఆర్టీసీ బస్సు సర్వీసులను విద్యార్థులు ఉపయోగిస్తున్నారని, గతంలో ఆదోని ఆర్టీసీ డిపో నుండి మోడల్ స్కూల్ కు ఉదయం రెండు బస్సులు ఉండేవని, ఒకటి సాధారణ సర్వీసు,

మరొకటి విద్యార్థి బస్సు అని సబ్ కలెక్టర్ కు వివరించారు. అయితే ప్రస్తుతం ఆదోని నుంచి ఉదయం 7.15 గంటలకు ఒక్క బస్సు మాత్రమే వస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు పాఠశాలకు సకాలంలో రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 4.00 గంటలకు వచ్చే విద్యార్థి బస్సు ప్రస్తుతం రావడం లేదన్నారు. గతంలో మాదిరిగా బస్సుల ఏర్పాటుకు ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచాపురం గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తా

విశాలాంధ్ర - నందవరం : మాచాపురం గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి అన్నారు.

సోమవారం మాచాపురం గ్రామంలో ఎంపీపీ స్కూల్లో మన బడి నాడు - నేడు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ,పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు తమ వంతు కృషితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని పేర్కొ న్నారు. మాచాపురం గ్రామంలో నాడు - నేడు ద్వారా పాఠశాల మర మ్మత్తులకు రూ. 27లక్షలు మంజూరు అయ్యాయన్నారు.రూ. 25 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన బడి నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని గ్రామ సర్పంచ్ వల్దొడ్డి కిష్టప్ప, ఎంపీటీసీ, నందవరం మండల వైస్ ఎంపీపీ అగ్నేశమ్మ, అన్నారు. ఈ కార్యక్ర మంలో వై సీపీ ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాసు రెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరూ పాక్షి రెడ్డి, ఈఓపిఆర్డీ. ఈశ్వరయ్య, ఉప సర్పంచ్ సప్పోగు కోటప్ప, మచాపుర గ్రామసచివాలయ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హరిజనవాడను అంబేద్కర్ నగర్‌గా మార్చండి

విశాలాంధ్ర - మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని హరిజనవాడను అంబేద్కర్ నగర్‌గా మార్చాలని హరిజన కాలనీవాసులు సురేష్, ఆనంద్ కోరారు.ఈ మేరకు సోమవారం

పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పంచాయతీ సలహాదారుడు బండారి ఆంజనేయులు లకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హరిజనవాడను ఒక్కొక్కరు ఒక్కో విధంగా అనేక రకాల పేర్లతో పిలుస్తున్నారని అలా కాకుండా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పేరుతో అంబేద్కర్ నగర్ గా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయులు,సురేంద్ర,ఈరన్న పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఆస్పరి : గ్రామ పంచాయతీ సర్పం చుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు హరికృష్ణ, మండల కార్యదర్శి సావిత్రమ్మ, ఉపాధ్యక్షులు నెల్లూరప్పలు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో

మండల సర్పంచుల సంఘం సమావేశాన్ని మాజీ సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షత నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు ఉత్సవ విగ్రహా లుగా మాత్రమే మిగిలిపోతున్నారన్నారు. సర్పంచులు అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం వాడుకున్న పంచాయతీ నిధులను తక్షణమే గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని, అలాగే సర్పంచుల సమస్యలు పరిష్కరించని పక్షంలో జిల్లా కేంద్రాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. సర్పంచుల మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిన్నహోతూరు సర్పంచ్ హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా జొహరాపురం సర్పంచ్ నెల్లూరప్ప, కార్యదర్శిగా నగరూరు సర్పంచ్ సావిత్రమ్మ, కోశాధికారిగా బనవనూరు సర్పంచ్ పెద్దిరెడ్డి లతో పాటు 12 మందిని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యవర్గాన్ని శాలువ పూలమాల లతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వైకాపా మండల కన్వీనర్ పెద్దయ్య, కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, ఎంపీటీసీ రాధాకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు వెంకటేష్, తోయజాక్షప్ప, మురళీ మోహన్, యాటకల్లు పెద్దిరెడ్డి, శివారెడ్డి, నాయుడు, బద్రి, నాగేంద్ర, రంగన్నలు పాల్గొన్నారు.

ఐక్యతతో ఏదైనా సాధించవచ్చు

విశాలాంధ్ర - ఆదోని : ఐక్యతగా కలిసిమెలిసి ఉంటే రాజకీయంగా ఆర్థికంగా నిలదొక్కుకొని ఏదైనా సాధించవచ్చు అని సంఘం నాయకుడు సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆదోని మండలం పాండవగల్లు గ్రామం పాతరయ్య ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో కార్తీక మాసం వన భోజనం

నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్, సుబ్రమణ్యం మాట్లాడుతూ కుల ఐక్యతకు, కుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. నాయకులు ఆర్లబండ గురుస్వామి మాట్లాడుతూ మాదిగ దాసు కుల సంఘం యొక్క ప్రాముఖ్యతను విధి విధానాలను తెలియజేశారు. ప్రతి సంవత్సరం కార్తీక మాస వనభోజనాలు నిర్వహిస్తూ మన కులం యొక్క అభ్యున్నతి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల రవి జిల్లా అధ్యక్షులు నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్, కోశాధికారి ఆదోని గురుస్వామి, పాండవగల్లు రామదాసు, హనుమంతు, కృష్ణమూర్తి, గణేకల్ రామాంజనేయులు, ఓబులేసు, చంద్ర, విలేఖరి రామాంజనేయులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం

విశాలాంధ్ర - కర్నూల్ సిటీ : స్పందనలో వచ్చిన అర్జీలను తాత్సారం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవ తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, మురికి కాలువలు, కుళాయి కనెక్షన్ టిడ్కోఇల్లు, ఇంటి పట్టా తదితర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు అందాయన్నారు. ఈ అర్జీలను సంబంధిత శాఖలకు పంపించడం జరిగిందని, వాటన్నింటిని పరిశీలించి వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఉపకమిషనర్ఎస్.వి.రమాదేవి, ఎంహెచ్ఓ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈపివీ శేషసాయి, డిప్యూటీ సిటీ ప్లానర్‌మోహన్, టిపిఎస్ దామోదర్,మేనేజర్ చిన్న రాముదు ఆరో జునీదు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ : ప్రజల సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమ

వారం మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వకార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నవరత్న పథకాల లబ్ధిపై కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్నారన్నారు. అర్హులైన వారు నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైసీపీ అధికారంలోకిరాగానేకులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు.రాజకీయాలకు తావు లేకుండా అర్హత ప్రామాణి కంగా పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వాలంటరీలు, సచివాల సిబ్బంది, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏజీపీగా న్యాయవాది అంజినప్ప

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఎస్. అంజినప్పను సోమవారం ప్రభుత్వ న్యాయవాదిగా నియమించింది. ఇందుకు సహకరించిన ఆదోని ఎమ్మెల్యే వై. సాయి ప్రసాద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగి రెడ్డి,వైసీపీ నేతలుప్రదీప్‌రెడ్డి,ధరణిరెడ్డి, మనోజ్‌రెడ్డి, బాపురం చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తుఫాను దెబ్బతో రైతుల్లో గుబులు

విశాలాంధ్ర- హొళగుంద : రాయలసీమలో అల్పపీడనం ప్రభావం వల్ల సోమవారం మండలంలో ముసురు కప్పుకుంది వరి పంటలు కోత దశలో ఉన్నాయి. అలాగే కొందరు రైతులు వరి కోతల పనుల్లో బిజీగా కనిపించారు. వర్షం వస్తే వరి ధాన్యాలు రాలిపోతాయని వరి మిషన్ల ద్వారా కోసిన వరి ధాన్యాలు తడిసి పోయి అపార నష్టం కలుగుతుందని ఆయకట్టు రైతులు వాపోయారు.వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో రైతులు ఆందోళన చెందారు. వర్షానికి వరి ధాన్యాలు తడిస్తే వ్యాపారస్తు లు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తారని అన్నారు.వర్షం పడితే వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లభించదని పెట్టుబడి కూడా రావడం కష్టమని వరిగడ్డి తడిసి కుళ్లిపోతుందని రైతులు ఆరోపించారు. మండలంలో చినుకులు ప్రారంభం కావడంతో వరి మిషన్లకు భారీ డిమాండ్ పెరిగింది. కోసినవరి ధాన్యాలను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

ఏప్రిల్ దాకా నీళ్లు ఇవ్వాలంటూ ధర్నా

విశాలాంధ్ర-దేవనకొండ : రబీ కింద పంటలను సాగు చేసిన రైతులకు

ఏప్రిల్ చివరి వరకు నీరందించాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేశారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం. జగదీష్ అన్నారు. సోమవారం మండల అధ్యక్ష, కార్యదర్శిలు ఇబ్రహీం, శివశంకర్‌లు మాట్లాడుతూ శ్రీశైలం ద్యాం నందు నీటి మట్టం తగ్గుతున్నందుకు జనవరి నెల నుండి నీళ్ల ఇవ్వవబోమని హంద్రీనీవా అధికారులు ప్రకటనలు చేస్తుడటంతో పంటలు సాగు చేసిన రైతులు సందిగ్ధంలో మునిపోయారన్నారు. వేలాది రూపాయాలు పెట్టి వేరుశెనగ, పప్పుశనగ, జొన్నతదితర పంటలు సాగు చేశారని, పంటలకు సాగునీరు అందకపోతే పంటలు ఏండిపోయి రైతులు నష్టపోయో ప్రమాదముందన్నారు. మండలంలోని రైతులకు పందికోన జలశాయం నుండి మార్చి చివర దాకా నీళ్లు ఇవ్వాలని లేకపోతే రైతులను కలుపుకొని ఉద్యమాలనుఉధృతంచేస్తామనిహెచ్చరించారు.ఎం.రాజు, యూసుఫ్, రసీద్,ఉశేని,నరేంద్ర,వీరేష్,వెంకటరాముదు, నారాయణ, పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పలు

విశాలాంధ్ర-మద్దికెర : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని అయ్యప్ప స్వామి మాలదారులు సోమవారం శబరిమల కు తరలి వెళ్లారు. మద్దికేర గ్రామంలోని స్థానిక నాగేశ్వర స్వామి దేవాలయము నందు అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఇరుముడులు కట్టుకొని శబరిమలకు తరలి వెళ్లారు. మద్దికెర గ్రామ శివారులలో ఉన్న వెంకప్ప స్వామి దేవాలయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్తీక వనభోజనాలను గ్రామానికి చెందిన డి.శ్రీనివాస్ యాదవ్,కె. కృష్ణ యాదవ్,లక్ష్మీనారాయణ యాదవ్,నాగేష్‌ల ఆధ్వర్యంలో ఈ వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు కవి రెడ్డి సూర్యనారాయణ,సంజప్ప,రంగనాథ్,చంద్రశేఖర్,నెట్టికంటయ్య భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.